క్లుప్తంగా

వైభవంగా అచ్యుతస్వామి కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు

కలువాయి: మండలంలోని కుల్లూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత అచ్యుతస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి, అమ్మవార్లకు కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధి

చిల్లకూరు : చిల్లకూరు దళితవాడలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆనందయ్య కుటుంబానికి శనివారం చేడిమాల గ్రామంలోని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. ఆనందయ్య మృతితో కుటుంబం తీవ్ర ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని గ్రామస్తుడు నావూరు మస్తానయ్య ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులునాయుడు దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఆయన మృతుని కుటుంబ సభ్యులకు రూ.10 వేలను ట్రస్టు ప్రతినిధి బాబు ద్వారా అందించారు. భవిష్యత్తులో కూడా వారికి ట్రస్టు అండగా ఉంటామని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొట్టు రాధయ్య, నగరం ఆర్ముగం, వెందోటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష జేఏసీ కో చైర్మన్‌గా నాగరాజు



చిల్లకూరు : స్థానిక భవిత కేంద్రంలో ఐఈ ఆర్‌టీగా పనిచేస్తున్న బొమ్మి నాగరాజు రాష్ట్ర సమగ్ర శిక్ష జేఏసీ కో చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. విజయవాడలో శనివారం రాష్ట్ర సమగ్ర శిక్ష జేఏసీ కమిటీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ క్రమంలో తిరుపతి జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు లభించగా వారిలో చిల్లకూరు ఐఈఆర్‌టీలో పనిచేస్తున్న డాక్టర్ బొమ్మి నాగరాజును ఏకగ్రీవంగా కమిటీ రాష్ట్ర జేఏసీ కో చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి జేఏసీ ద్వారా కృషి చేస్తామన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

కలువాయి: మండలంలో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు 80 శాతం పూర్తయ్యాయని, ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పురుషోత్తం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆర్.లక్ష్మిదేవి మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా తాగునీటి బోర్లు మరమ్మతులకు గురైతే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే బాగు చేయిస్తామన్నారు. ఉపాధి పథకంలో నిమ్మతోటలు సాగు చేసుకోవాలనే రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి పథకం ఏపీవో మురళీ పేర్కొన్నారు. కలువాయి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఇటీవల మరణించిన యశ్వంత్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పంగా పెంచలనరసారెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్, ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన గోవర్ధన్‌రెడ్డి

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరు వద్ద శనివారం సాయంత్రం కారు ఢీకొనడంతో వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. దిగువచావలి గ్రామానికి చెందిన కామిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయంలో పనులు ముగించుకుని బైక్‌లో ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో హైవే రోడ్డు పైకి వెళ్లే సమయంలో నెల్లూరు నుంచి తిరుపతి విమానాశ్రయానికి వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో గోవర్ధన్‌రెడ్డి గాయపడ్డాడు. అతన్ని స్థానికులు నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు.

జాతీయ రహదారిపై ఆగని ప్రమాదాలు



ప్రమాదంలో ముందు భాగం దెబ్బతిన్న ట్రావెల్ బస్సును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



గూడూరు రూరల్ పరిధిలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

- కనిపించని హెచ్చరిక బోర్డులు, స్పీడ్ కంట్రోల్ బోర్డులు
- ప్రమాదాలను గుర్తించే నిఘా నేత్రాలు కరువు
- పట్టించుకోని టోల్‌ప్లాజా భద్రతా సిబ్బంది, పోలీసు అధికారులు

చిల్లకూరు : చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-5) గూడూరు డివిజన్‌లో 13 కీమీ దూరం ఉంది. దీనిపై ప్రమాదాల నివారణను పోలీసులు, జాతీయ రహదారి భద్రత సిబ్బంది గాలికి వదిలేశారు. దీంతో ప్రతి నిత్యమూ ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గూడూరు రూరల్ పరిధిలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల నుంచి చిల్లకూరు మండలం చుట్టుగుంట వరకు 13 కిలోమీటర్ల జాతీయ రహదారి ఉంది. ఈ ప్రాంతాలు చిల్లకూరు, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోకి వస్తాయి. ఈ రహదారిపై బూదనం సమీపంలో ఉండే స్వర్ణా టోల్ వే భద్రతా సిబ్బందితో పాటు అందులో పని చేసే అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

8 ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్లు

గూడూరు రూరల్, చిల్లకూరు మండలాల మీదుగా వెళ్లే జాతీయ రహదారి 13 కిలోమీటర్ల దూరంలో 8 ప్రాంతాలు అత్యంత క్లిష్టమైనవిగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎంతో మంది అంగ వైకల్యం చెందుతున్నారు. ఆరు నెలల కాలంలో పదుల సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ముఖ్యంగా ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల, నారాయణ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే మార్గం, పోటుపాళెం సర్కిల్, వరగలి క్రాస్ రోడ్డు, రైటార్ సత్రం, కోట క్రాస్ రోడ్డు, బూదనం మలుపు, పట్రగుంట ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో అధికారులు కనీసం సూచిక బోర్డులు, స్పీడ్ కంట్రోల్ బోర్డులు కూడా ఏర్పాటుచేయలేదు.


కనిపించని సీసీ కెమెరాలు

జాతీయ రహదారిపై హిట్ అండ్ రన్ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. ప్రమాదానికి ఏ వాహనం కారణమనే విషయాన్ని తెలుసుకునేందుకు జాతీయ రహదారి కూడలి ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. అవి సక్రమంగా పని చేయకపోవడంతో ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించడంలో ఆలస్యమవుతోంది. ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో సీసీ కెమెరాల పని తీరుపై పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది హడావుడి చేసి తర్వాత మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిర్లక్ష్యంగా టోల్ ప్లాజా సిబ్బంది పనితీరు

జాతీయ రహదారిలో ఇరు వైపులా వాహనాలు ఎక్కువ సేపు నిలపకుండా టోల్‌ప్లాజా భద్రతా సిబ్బంది చూడాల్సి ఉంటుంది. వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో అక్కడక్కడా పదుల సంఖ్యలో వాహనాలను నిలుపుతున్నారు. ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాలు ఆగి ఉన్న వాహనాలను తప్పించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. తద్వారా చిన్న వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు కూడా రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాల్సి ఉంది. అయినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. హిట్ అండ్ రన్ కేసులపైనా ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రమాదానికి కారణమైన వాహనాలను గుర్తిస్తున్నాం. త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం.

– సూర్యనారాయణరెడ్డి, గూడూరు డీఎస్పీ

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శ్రీదేవిని పరామర్శిస్తున్న కిలివేటి సంజీవయ్య



చంద్రశేఖర్‌రెడ్డితో మాట్లాడుతున్న సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పట్టణ జేసీఎస్ కన్వీనర్ అయితా శ్రీధర్ తల్లి శ్రీదేవి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఆస్పత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైద్యశాలకు వెళ్లి ఆమెను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాగేశ్వర ఆలయ చైర్మన్ స్వామిరెడ్డి, కౌన్సిలర్ మీజూరు రమాకృష్ణ, నాయకులు అలవల సురేష్, కాకి శ్రీరామమూర్తి, చిలకా యుగంధర్, భగవాన్‌దాస్, విజయ్, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్‌లో ..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో నివాసముంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మారంరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని శనివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. చంద్రశేఖర్ రెడ్డి కొద్ది రోజుల క్రితం ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరు ప్రయివేటు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో చంద్రశేఖర్ రెడ్డి నివాసం వద్దకు సంజీవయ్య వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, నాయకుడు మారంరెడ్డి ముత్యాల రెడ్డి తదితరులు ఉన్నారు.

వరి విత్తనాలను అందుబాటులో ఉంచాలి





సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, మాట్లాడుతున్న ఎంపీపీ అరుణారెడ్డి

ఓజిలి: రైతు భరోసా కేంద్రాల ద్వారా వరి విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన, విద్య, వైద్యం, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, రెవెన్యూ, పౌరసరఫరాలు, గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా చూడాలన్నారు. విత్తనాల కోసం రైతులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉద్యానవనశాఖలో అమలవుతున్న పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఉపాధి కింద ప్రతి కూలీకి వంద రోజుల పనులు కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు వైద్య సేవలను విస్తృతం చేయాలని తెలిపారు. 104, 108 వాహనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో శ్రీనివాసులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుంటమడుగు రవీంద్రరాజు, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంధోత్సవం

దొరవారిసత్రం : నెలబల్లి గ్రామంలోని హుస్సేనమ్మ దర్గా వద్ద చేపట్టిన ప్రదర్శనలు భక్తులను, యువతను ఆకట్టుకున్నాయి. గంధోత్సవాలు శనివారం ముగిశాయి. శనివారం రాత్రి దర్గా వద్ద నిర్వహించిన పాటకచేరి, చిన్నారుల ఆటపాటలు యువతను ఉర్రూతలూగించాయి. నాయుడుపేట, సూళ్లూరుపేట, పెళ్లకూరు, తడ, ఓజిలి, గూడూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ తిరుమలరావు చర్యలు చేపట్టారు.



దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు



స్టేజీపై చిన్నారి నృత్య ప్రదర్శన

కుంగిన కల్వర్టు



కూలిన కల్వర్టుపై అవస్థ పడుతున్న స్థానికులు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని విందూరుకు వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టు శనివారం వేకువజామున ఉన్నట్టుండి కుంగిపోయింది. ఆ సమయంలో అటుగా ఎవరూ ప్రయాణం చేయకపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. రోడ్డుపై కల్వర్టు కుంగిన విషయం తెలియక అటు వైపు ఉన్న ఐదు గ్రామాల వారు, విద్యార్థులు అక్కడికి చేరుకున్నారు. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే అవకాశం లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. చివరికి స్థానికులు బైక్‌లు వెళ్లేలా మరమ్మతులు చేసుకున్నారు. ప్రయివేటు పాఠశాలల బస్సులు గ్రామాలకు వెళ్లలేక పోవడంతో విద్యార్థులు, మార్కెట్టుకు కూరగాయలు తీసుకువెళ్లే రైతులు ఇబ్బంది పడ్డారు. నాసిరకం పైపులు వేయడం వల్లే ఇలా కుంగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఇంటిలో చోరీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం ముస్లిం వీధిలో నివాసముంటున్న సుభాషిణి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దుండగులు ప్రహరీ గేటు, గ్రిల్స్ తాళాలతోపాటు తలుపుల తాళాలు పగులగొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. మిద్దెపై నివాసం ఉంటున్న వారు కిందకు రాకుండా ఆ ఇంటి తలుపులకు గొళ్లెం పెట్టారు. అనంతరం కింద ఇంటిలోకి ప్రవేశించి బీరువా తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రూ.1500 చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో విలువైన వస్తువులు పెట్టకుండా జాగ్రత్త తీసుకోవడంతో రూ.1500 మాత్రమే చోరీకి గురైందని బాధితులు తెలిపారు. పోలీసులు ఇంటి వద్దకు చెరుకుని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

మాంబట్టు శివాలయంలో ప్రత్యేక పూజలు

తడ: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మాంబట్టులో వెలసిన శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్విమ్స్ వైద్యులు కారణి మునస్వామి ఆధ్వర్యంలో గోపూజ, అభిషేకాలు చేశారు. టీటీడీ అన్నమాచార్య భక్త బృందం హరికథా గానం చేపట్టారు. అన్నదానం చేశారు. కార్యక్రమానికి ఉభయ దాతలుగా మాంబట్టుకు చెందిన సమ్మన తిరుపాల్, పసుపులేటి సుబ్బరామయ్య, తిరుపతికి చెందిన రాందురై వ్యవహరించారు. కార్యక్రమంలో ఇట్టిగుంట రమణయ్య, వెంకటరావు, దేవేందర్‌రెడ్డి, దేవసేనమ్మ, హరహరనాదరెడ్డి, పాముల పురుషోత్తం, నందారెడ్డి, సురేష్‌రెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో..

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఊహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ సారధ్యంలో సుబ్రమణ్యం పీఠం సభ్యులతో కలిసి పూజ కార్యక్రమాలు చేపట్టారు.

రేపు ఐటీఐలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

గూడూరు రూరల్ : గూడూరు ఐటీఐలో సోమవారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణా అధికారుల ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఐటీఐలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేస్తారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం ఐటీఐ పూర్తయ్యేవారితోపాటు ఐటీఐలో అన్ని ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన వారు పాల్గొనవచ్చని తెలిపారు.

చదువులమ్మ గుడిలో.. జ్ఞాపకాల ఒడిలో..



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- బీసీ గురుకుల పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం
- పాఠశాలకు రూ.3 లక్షల సాయం

కోట : మండల కేంద్రమైన కోటలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2003–04లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం సమావేశమయ్యారు. సాయంత్రం వరకు సందడి చేశారు. ఆత్మీయంగా పలకరించుకున్నారు. 20 ఏళ్ల క్రితం బడిలో తాము గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ అనుభవాలను నేటి విద్యార్థులతో పంచుకున్నారు. గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వాటర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, వాటర్ ప్యూరిఫైయర్, విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లు మొత్తం రూ.3 లక్షలు విలువైన సాయం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ బీసీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రగతికి పూర్వ విద్యార్థులు సాయం అందించడం శుభపరిణామమన్నారు.

శ్రేష్ట నెట్స్-2024లో నాయుడుపేట విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని పీఎంశ్రీ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పిగిలాం షైనీ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన శ్రేష్ట నెట్స్-2024లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం మనోజ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివా రం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇంటర్నేషనల్ కార్పొరేట్ స్కూళ్లలో ప్రవేశం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రేష్ట నెట్స్-2024 పరీక్ష నిర్వహించిందని తెలిపారు. ఈ ఫలితాల్లో పిగిలాం షైనీ జాతీయ స్థాయిలో 228 ర్యాంకు సాధించినట్లు హెచ్‌ఎం వివరించారు. అంతేకాకుండా షైనీ ఇటీవల విడుదలైన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు సైతం ఎంపికైనట్టు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కోగిలి జయరామరెడ్డి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

కండలేరులో 6.374 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.374 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



తడలో ర్యాలీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

తడ: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. వారు శనివారం తడలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, రుక్మాంగదరావు, ఎంఈవో మల్లికార్జునరావు, హెచ్‌ఎంలు శ్రీనివాసులు, ఐఈఆర్‌టీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భెల్ ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలి



నిరసన తెలుపుతున్న చింతామోహన్

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి సమీపంలో ఉన్న మన్నవరం భెల్ ప్రాజెక్టు పనులను పునరుద్ధరించి వెంటనే పూర్తి చేయాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం వెంకటగిరిలోని తెలుగుగంగ అతిథి గృహంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ గత 14 ఏళ్ల క్రితం ఇంటికో ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగులకు ఆశ చూపించి భెల్ ప్రాజెక్టును స్థాపించినట్టు తెలిపారు. పాలకులు దాన్ని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసి నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి భెల్ ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ సమస్యలపై సత్వరమే చర్యలు

పెళ్లకూరు: రెవెన్యూ, భూ సమస్యలపై సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ ప్రసాద్‌రావు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన శనివారం సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు ధ్రువీకరణ కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా వెంటనే మంజూరు చేయాలన్నారు. భూసమస్యలపై వచ్చే దరఖాస్తులను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే లక్ష్యం దిశగా శిస్తు వసూలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషినిబాయి, వీఆర్వోలు రవిచంద్ర, రమేష్, సుధాకర్, తేజ, వంశీ, సర్వేయర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బూదూరు భూసమస్య పరిష్కారమెప్పుడో..?

- పరిష్కరించలేని స్థితిలో రెవెన్యూ అధికారులు
- రెవెన్యూ కోర్టుకు హాజరైన బాధిత రైతులు



డీవీ సత్రం కార్యాలయం వద్ద రెవెన్యూ కోర్టుకు భూసమస్యపై హాజరైన బాధిత రైతులు

దొరవారిసత్రం : ×మా భూముల రికార్డులను ఒక రియల్టర్ తారుమారు చేసి అమ్మి సొమ్ము చేసుకున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఒకటి రెండు దఫాలు రెవెన్యూ కోర్టును నిర్వహించి విచారించారు. సమస్యను మాత్రం పరిష్కరించలేదు. ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా మొక్కుబడిగా విచారణ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి₹ అని మండలంలోని బూదూరుకు చెందిన బాధిత రైతులు వాపోతున్నారు. దొరవారిసత్రం మండలం బూదూరు గ్రామం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 31-24, 46-28, 39-15, 37-19, 37-4, 40-15, 51-8, 59-1, 53-12, 47-1, 47-7, 46-2, 47-12, 70-1, 65-32లోని 20 ఎకరాలకు పైగా భూములను ఒక రియల్టర్ కొందరు స్థానికుల సహకారంతో రెవెన్యూ అధికారులకు రూ.లక్షల ముడుపులు చెల్లించి రికార్డులను తారుమారు చేశాడు. వేరేవాళ్లకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం తెలుసుకున్న బాధిత రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ఐదేళ్లుగా మొక్కుబడిగా విచారణ చేసి చేతులు దులుపుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్ బూదూరులోని భూ సమస్యలపై రెవెన్యూ కోర్టు నిర్వహించగా బాధిత రైతులు 15 మంది హాజరయ్యారు. రియల్టర్లు రాలేదు. దీంతో రెవెన్యూ కోర్టును తహసీల్దార్ వాయిదా వేశారు.

నా పేరుతో భూ రికార్డులు సృష్టించారు



సర్వే నంబరు 31-17లో నాకు భూమి లేదు. కానీ 22 సెంట్ల భూమిని నేను కొనుగోలు చేసినట్టు రికార్డులు సృష్టించారు. తర్వాత వేరేవాళ్లకు అమ్మేసినట్టు రికార్డులు తయారు చేశారు. రిజిస్ట్రేషన్ కూడా చేసినట్టు తెలిసింది.

– బుడ్డతొట్టి రమణమ్మ, ఎస్సీకాలనీ, బూదూరు

నాకు తెలియకుండానే విక్రయించారు



నాకు బూదూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 51-8, 53-1, 59-1లో అర ఎకరా వరకు భూమి ఉంది. దాన్ని నేను ఎవరికీ విక్రయించలేదు. కానీ గతంలోనే అమ్మేసినట్లు రియల్టర్లు ఫోర్జరీ సంతకాలతో రికార్డులను సృష్టించారు.

– సాలు రంగయ్య, బూదూరు ఎస్సీ కాలనీ

త్వరలోనే రెవెన్యూ కోర్టు

బూదూరు గ్రామంలోని భూసమస్యపై ఒక వర్గం రైతుల మాత్రమే రెవెన్యూ కోర్టుకు హాజరయ్యారు. మరో వర్గం వారు రాలేదు. త్వరలోనే మళ్లీ కోర్టును నిర్వహించి విచారిస్తాం. తదుపరి క్షేత్ర స్థాయిలో విచారించి బాధిత రైతులకు న్యాయం చేస్తాం.

– ప్రసాద్, తహసీల్దార్, డీవీ సత్రం